


### ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే..

# బీఆర్ఎస్‌దే అధికారం

- కేసీఆర్ మళ్లీ రావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారు
- సభా ప్రాంగణంలో ముందు వరుసలో ఉండి ఆయన ప్రసంగం వినేందుకు ఎదురుచూస్తున్నారు
- ఉదయం 8 గంటలకే నేను వరంగల్‌కు బయలుదేరి వెళ్తున్నా
- కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా

పాల్వంచ, ఏప్రిల్ 26: ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే బీఆర్ఎస్సే అధికారంలోకి వస్తుందని కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. గత పదేళ్ల కేసీఆర్ పాలన తెలంగాణకు స్వర్ణయుగంగా గడిచిందని గుర్తుచేసుకుంటున్నారని, గత ఎన్నికల్లో ఆయనను ఎందుకు ఓడించుకున్నామా నని మదనపడుతున్నారని అన్నారు. కేసీఆర్ మళ్లీ రావాలని తెలంగాణ ప్రజలందరూ కోరుకుంటున్నారని అన్నారు. పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీలు అమలుచేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు చీదరించుకుంటున్నారని అన్నారు. అలాగే, 42 ఏళ్ల తన రాజకీయ జీవితంలో రేవంత్‌రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని ఎన్నడూ చూడలేదని అన్నారు. సీఎం హోదాలో ఉండి అత్యంత నీచమైన భాష మాట్లాడుతూ ప్రజల్లో పలుచనయ్యారని ఆరోపించారు. మంత్రులు కూడా 'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని, ఒక్కొక్కరూ ఒక్కో స్టేట్‌మెంట్ ఇస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. మంత్రివర్గ విస్తరణ చేసే పరిస్థితి కూడా లేదని, ఒకవేళ విస్తరణ చేపడితే పరిణామాలు ఏ విధంగా ఉంటాయోనని సీఎం భయపడుతున్నారని ఎద్దేవాచేశారు. రజతోత్సవ సభకు తరలివెళ్లేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు కొత్తగూడెంలోని టేకులపల్లి క్రాస్‌రోడ్డులోని గులాబీ జెండా ఎగురవేసి భారీ సంఖ్యలో వాహనాల్లో శ్రేణులను తోడ్కొని తాను ఎల్కతుర్తి బయలుదేరుతున్నట్లు చెప్పారు. సభ ముందు భాగాన కూర్చొని కేసీఆర్ ప్రసంగాన్ని వినేందుకు ప్రజలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కిలారు నాగేశ్వరరావు, వనమా రాఘవేందర్‌రావు, రాజుగౌడ్, శ్రీరామ్మూర్తి, విశ్వనాథం, కనకేశ్, మల్లెల రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సభను జయప్రదం చేద్దాం

### సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

వేంసూరు, ఏప్రిల్ 26: ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం వేంసూరు మండలం దుద్దెపూడి గ్రామంలో బీఆర్ఎస్ జెండాను ఆయన ఆవిష్కరించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ మృతిచెందిన వారికి మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ కాంగ్రెస్ వచ్చి 15 నెలలు అవుతున్నా నేటి వరకు అర్హులకు పథకాలు అందని ద్రాక్షలాగా మారాయని, ఈ ప్రభుత్వం ప్రతిదీ ఎగవేత ధోరణిలో అవలంబిస్తూ ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. గ్రామాల్లో ముందుగా బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించి వరంగల్ సభకు తరలిరావాలని నాయకులకు సూచించారు. బీఆర్ఎస్ నాయకులు పాల వెంకటరెడ్డి, మోరంపూడి శ్రీధర్‌బాబు, మట్టా రవి, మోరంపూడి రామకృష్ణ, యర్రా రమేష్, మహేశ్వరరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



గులాబీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర

*వరంగల్‌లో బీఆర్ఎస్ నిర్వహించనున్న రజతోత్సవ సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పార్టీ శ్రేణులు భారీ ఎత్తున బయలుదేరేందుకు సన్నద్ధమవుతున్నాయి. 16 నెలల కాంగ్రెస్ పాలనలో అన్యాయం జరుగుతుండడం, పథకాలు అందకపోవడం వంటి కారణాలతో అన్ని వర్గాల ప్రజలూ ప్రభుత్వంపై ఆగ్రహంగా ఉన్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఇచ్చిన పిలుపుమేరకు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే భారీ బహిరంగసభకు హాజరయ్యేందుకు స్వచ్ఛందంగా పయనమవుతున్నారు. ఈ సభపై ఉమ్మడి జిల్లాలో విశేష స్పందన లభిస్తోంది. దీంతో అనేక గ్రామాల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా వాహనాలు సమకూర్చుకుంటూ ఎల్కతుర్తి సభకు సిద్ధమవుతున్నారు. దీంతో దారులన్నీ ఎల్కతుర్తివైపే చూపిస్తున్నాయి.*

*–ఖమ్మం, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

# దారులన్నీ ఎల్కతుర్తి వైపే..

- బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలుతున్న పార్టీ శ్రేణులు, అభిమానులు
- సభా ప్రాంగణానికి చేరుకునేందుకు నియోజకవర్గాల వారీగా ప్రత్యేక రూట్‌మ్యాప్
- ప్రజా రవాణాలో స్వచ్ఛందంగా బయలుదేరుతున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు
- పాతికేళ్ల పండుగ విజయవంతానికి పక్షం రోజులుగా ప్రచారం చేసిన పార్టీ నేతలు
- పల్లెలు, పట్టణాల్లో బీఆర్ఎస్ దిమ్మెలపై గులాబీ జెండాలను ఎగురవేసి పయనం



విద్యుత్ దీపాల వెలుగుల్లో సభా ప్రాంగణం

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి భారీ సంఖ్యలో వెళ్లేందుకు ఆయా మండలాల పార్టీ శ్రేణులు సన్నద్ధమయ్యాయి. ప్రతీ గ్రామం నుంచి బస్సులు బయలుదేరేలా, ఒక్కో బస్సుకు ఇద్దరు చొప్పున ఇన్‌చార్జులు ఉండేలా ఏర్పాట్లు చేసుకున్నారు. సభ ప్రారంభానికి ముందే ప్రాంగణానికి చేరుకునేలా ఇన్‌చార్జులు రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేశారు. రజతోత్సవ సభ విజయవంతం కోసం పక్షం రోజులుగా ఉమ్మడి జిల్లాలో పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపీలు నామా నాగేశ్వరరావు, మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, హరిప్రియానాయక్, మెచ్చా నాగేశ్వరరావు, బానోత్ మదన్‌లాల్, బానోతు చంద్రావతి, తాటి వెంకటేశ్వర్లు, కొండబాల కోటేశ్వరరావు, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు తదితరులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి శ్రేణులను సన్నద్ధం చేశారు.

బీఆర్ఎస్ ఆవిర్భావం, పాతికేళ్ల ప్రస్థానం, తెలంగాణ సాధన, పార్టీ అధినేత కేసీఆర్ కృషి వంటి అంశాలు; తెలంగాణను కాపాడుకునేందుకు చేపట్టబోయే భవిష్యత్ కార్యాచరణ వంటి విషయాలపై సభ జరుగనున్న నేపథ్యంలో కార్యకర్తల్లో నూతనోత్సాహం నెలకొంది. ఈ క్రమంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి గ్రామంలోనూ బీఆర్ఎస్ దిమ్మెలు నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. ఆదివారం ఉదయం సభకు బయలుదేరే ముందు పార్టీ దిమ్మెలపై గులాబీ జెండాలను ఆవిష్కరించనున్నారు. ఆ తరువాత బస్సులు, ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి సభకు వెళ్లనున్నారు. ఎండకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు బస్సులు, వాహనాల్లో మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు ఏర్పాటు చేస్తున్నారు. సభా ప్రాంగణానికి సులభంగా చేరుకునేందుకు ప్రత్యేక రూట్‌మ్యాట్ రూపొందించారు. సభా ప్రాంగణం సమీపంలో భద్రాద్రి జిల్లా నుంచి వెళ్లే వాహనాలకు ఒక జోన్‌లో, ఖమ్మం జిల్లా నుంచి వెళ్లే వాహనాలకు మరో జోన్‌లో పార్కింగ్‌ను ఏర్పాటుచేశారు.



సభ జయప్రదం కోసం సత్తుపల్లిలో బైక్ ర్యాలీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

పార్టీ రజతోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం ఖమ్మంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి ఎల్కతుర్తి సభకు పయనం కానున్నారు. అలాగే, నియోజకవర్గాల నుంచి కూడా ఇన్‌చార్జులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కలిసి సభకు బయలుదేరనున్నారు. రజతోత్సవ సభ ప్రాధాన్యాన్ని వివరిస్తూ మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నేతృత్వంలో ఖమ్మంలో పెద్ద ఎత్తున వాల్‌రైటింగ్ చేపట్టారు. వాల్‌పోస్టర్లు అంటించారు. ప్రతి గ్రామంలోనూ పోస్టర్లు, వాల్‌రైటింగ్‌లు ఉండేలా పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ సమన్వయం చేశారు. పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు కూడా నేతలతో కలిసి ఐదు నియోజకవర్గాల్లో పర్యటించి విస్తృతంగా ప్రచారం చేశారు. ఎల్కతుర్తి సభకు వెళ్లేందుకు ఖర్చుల కోసం శ్రమదానం కూడా చేశారు.




### ఆటంకం కల్పిస్తే పింక్ బుక్‌లో నమోదు చేస్తాం..



ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవ సభకు తరలివెళ్లేందుకు కార్యకర్తల, పార్టీ అభిమానుల సమరోత్సాహన్ని చూసి ప్రభుత్వం గంగవెర్రులెత్తుతోంది. జిల్లా నుంచి సభకు వెళ్లే పార్టీ శ్రేణులకు ఉద్దేశపూర్వకంగా ఆటంకాలు కల్పించే భవిష్యత్తులో సంబంధిత అధికారులు మూల్యం చెల్లించుకోకతప్పదు. ఉమ్మడి జిల్లా నుంచి భారీగా తరలివెళ్తున్న పార్టీ శ్రేణులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. సభకు వెళ్లే శ్రేణులను ఇబ్బంది పట్టే ప్రయత్నాలు చేసే వారిని భవిష్యత్తులో వదిలిపెట్టం. పింక్ బుక్‌లో నమోదు చేస్తాం.

**–తాతా మధు, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు**

### అడ్డుకోవాలని చూస్తే అడ్రస్ లేకుండాపోతారు..



అణచివేతలతో తెలంగాణ ఉద్యమాన్ని ఆపలేకపోయారు. ఇప్పుడు రజతోత్సవ సభకు కూడా ఆటంకాలు కల్పించలేరు. ఒకవేళ ఆటంకాలు సృష్టిస్తే అడ్రస్ లేకుండా పోతారు. వరంగల్ సభకు అన్ని జిల్లాల నుంచి గులాబీ దండు కదులుతుంటే కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు. మణుగూరులో 37 బస్సులు ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం నుంచి ఒత్తిడి తెచ్చి తనిఖీల బృందాన్ని పంపే ప్రయత్నం చేశారు. ఎంతలా అడ్డుకోవాలని ప్రయత్నించినా రజతోత్సవ సభ విజయవంతమవుతుంది. కాంగ్రెస్ దిష్టిబొమ్మ దగ్గం చేసి మరీ సభకు వెళ్తాం.

**–రేగా కాంతారావు, బీఆర్ఎస్ భద్రాద్రి జిలా అధ్యక్షుడు**







- ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికలో అవకతవకలు జరిగాయి
- గత 'ఇందిరమ్మ' లబ్ధిదారులకు, కాంగ్రెస్ కార్యకర్తలకే ఇచ్చారు
- నిరుపేదలు, దివ్యాంగులు, వితంతువులను విస్మరించారు
- కాంగ్రెస్ నేతలు లంచాలు తీసుకొని జాబితాలో పేర్లు రాశారు
- చంద్రుగొండ మండలం బాలియాతండా మహిళల స్పష్టీకరణ
- సర్వేను అడ్డుకొని విచారణాధికారులను వెనక్కు పంపిన గ్రామస్తులు

### జాబితాలో అర్హుల పేర్లు పెట్టేదాకా..

# ఏ ఒక్క అధికారినీ ఊళ్లోకి రానివ్వం



గ్రామ స్పెషలాఫీసర్ శ్రీనివాసరావును ఊరి పొలిమేర నుంచే వెనక్కి పంపిస్తున్న గ్రామ మహిళలు

చంద్రుగొండ, ఏప్రిల్ 26: ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అర్హుల పేర్లు పెట్టేదాకా ఏ ఒక్క అధికారినీ ఊళ్లోకి రానివ్వబోమని భద్రాద్రి జిల్లా చంద్రుగొండ మండలం పోకలగూడెం పంచాయతీ బాలియాతండా మహిళలు స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఈ ఇళ్ల కోసం అర్హులను కాకుండా అనర్హులనే ఎంపిక చేశారని స్పష్టం చేశారు. ఈ మేరకు ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితా పట్టుకొని గ్రామంలో సర్వేకు వచ్చిన విచారణ అధికారులపై స్థానిక మహిళలు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వేను అడ్డుకొని అధికారులను వెనక్కు పంపారు. బాలియాతండాలో శనివారం జరిగిన ఈ ఘటన జిల్లాలో చర్చనీయాంశమైంది. చంద్రుగొండ మండలం పోకలగూడెం పంచాయతీ బాలియాతండా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన వారి వివరాల విచారణ కోసం పంచాయతీ ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, జీపీ సెక్రటరీ నాగేశ్వరరావు మండల కేంద్రం నుంచి శనివారం గ్రామానికి బయలుదేరారు. అయితే, అప్పటికే అర్హుల జాబితాను పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించడంతో ఎంపికైన వారి వివరాలు గ్రామస్తులకు తెలిశాయి. దీంతో గ్రామ మహిళలు, గ్రామస్తులు వారి గ్రామ పొలిమేర వద్దకు చేరుకున్నారు. ఇంతలో విచారణాధికారులు అక్కడికి రావడంతో వారిని అక్కడే నిలదీశారు. అర్హులను పక్కనబెట్టి అనర్హులను ఎంపికచేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే చేయడానికి వీల్లేదని అడ్డుకున్నారు. వారిని అదే గ్రామ పొలిమేర నుంచి వెనక్కు పంపించివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోకలగూడెం పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపించారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన వారికే ఇప్పుడు మళ్లీ ఇస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల పేర్లే ప్రస్తుత జాబితాలో ఉన్నాయని అన్నారు. నిరుపేదలు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులను పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు కాంగ్రెస్ నాయకులు లంచాలు తీసుకున్నారని ఆరోపించారు. లంచమిచ్చిన వారి పేర్లనే జాబితాలో రాశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ జాబితాను పూర్తిగా మార్చాలని, నిరుపేదల పేర్లతో కొత్త జాబితాను తయారు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకూ ఏ ఒక్క అధికారినీ తమ ఊళ్లోకి రానివ్వబోమని స్పష్టం చేశారు. అనంతరం గ్రామస్తులు, మహిళలు కలిసి చంద్రుగొండ మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి ఎంపీడీవో అశోక్‌కు ఫిర్యాదు చేశారు. ప్రస్తుత జాబితాలో అనర్హుల పేర్లు చేర్చిన అంశంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.



బాలియాతండాలో జీపీ సెక్రటరీ నాగేశ్వరరావుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు




